క్లుప్తంగా

పాఠశాల బస్సులకు 'ఫిట్‌నెస్' చేయించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రైవేట్ పాఠశాల, కళాశాలల బస్సులకు కచ్చితంగా ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలని ఎంవీఐ వివేకానందరెడ్డి పాఠశాల యజమానులకు సూచించారు. పెర్కిట్‌లో ఉన్న ఎంవీఐ కా ర్యాలయ ఆవరణలో పలు పాఠశాలల బస్సుల ను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యాని గడవు ముగిసేలోగా బస్సులను ఫిట్‌నెస్ చేయించాలన్నారు. లేకుంటే పాఠశాల గుర్తింపుతో పాటు రద్దు చేసే అవకా శం ఉందన్నారు. సిబ్బంది ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ రాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురికి కాలువలు, కరెంట్ స్తంభం లేదన్నారు. మురికినీరు రోడ్డుపై వచ్చి చేరుతోందన్నారు. దీంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలూర్ హెచ్‌ఎంకు సన్మానం



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేందర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలకు చెందిన ఆరుగురు పదో తరగతి విద్యార్థులు పది జీపీఏ సాధించడాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఇటీవల వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి హెచ్‌ఎం నరేందర్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు హెచ్‌ఎంను అభినందిస్తూ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ముత్యం, నాయకులు ఉదయ్, గంగారెడ్డి, సంజీవ్, ప్రైమరి పాఠశాల స్కూల్ హెచ్‌ఎం మురళి తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



పెర్కిట్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే దేశ నాయకుల స్ఫూర్తితో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పీఆర్టీయూ ఆర్మూర్ మండల అధ్యక్షుడు ఇట్టం గోపాల్ అన్నారు. కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇట్టం గోపాల్ బుధవారం రూ.10 వేలు విలువ చేసే దేశ నాయకుల చిత్ర పటాలను అందజేశారు. అనంతరం గోపాల్‌ను హెచ్‌ఎం కవిత అభినందించారు. కార్యక్రమంలో ఏఏపీ చైర్‌పర్సన్ లావణ్య, ఉపాధ్యాయులు వినోద్ కుమార్, చిన్నయ్య, భగవంత్ రావు, వినోద్, జయశ్రీ, రాజేందర్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజీనామా చేయాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైస్‌చైర్మన్ తన స్క్రాప్ దుకాణంలో దొంగ బండ్లు కొంటున్నారని అన్నారు. ఆర్మూర్‌లో ఇప్పటి వరకు ఎన్నో వాహనాలు దొంగతనానికి గురయ్యాయని ఆరోపించారు. పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు కల్లిగోట గంగాధర్, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, పాల్కం వేణు, మందుల బాలు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వేను వేగవంతం చేయాలి

రుద్రూర్: మిషన్ భగీరథ సర్వేను వేగవంతం చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా ఆదేశించారు. రుద్రూర్, సులేమాన్‌నగర్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను బుధవారం పరిశీలించారు. గ్రామాలకు త్వరగా వచ్చి సమగ్రంగా సర్వే చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవో సాయిలు, పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, మహమ్మద్ సోఫీ ఉన్నారు.

తెరుచుకున్న బడులు





రాంమందిర్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



జానకంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



నందిపేటలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్



సోన్‌పేట్‌లో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



నూత్‌పల్లిలో తహసీల్దార్



మచ్చర్లలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

- స్కూల్ దారిపట్టిన విద్యార్థులు
- దుస్తులు, పుస్తకాల పంపిణీ

ఆర్మూర్‌టౌన్/ నందిపేట్/ డొంకేశ్వర్/ రుద్రూర్/ పెర్కిట్/ బాల్కొండ/ రెంజల్/ కమ్మర్‌పల్లి/ వేల్పూర్/ మాక్లూర్/ ఆర్మూర్‌టౌన్/ ఎడపల్లి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు సంతోషంగా పాఠశాలలకు హాజరయ్యారు. ఉపాధ్యాయుల చెప్పిన పాఠాలను శ్రద్ధగా విన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకరూప దుస్తులు, ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ హెచ్‌ఎస్ రాంమందిర్ పాఠశాలకు విద్యార్థులకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిజ్ఞ చేయించి పుస్తకాలు అందజేశారు.

నందిపేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి, గాదేపల్లి, నికాల్‌పూర్, మారంపల్లి, తొండాకూర్, డొంకేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ వెంకటరమణ దుస్తులు, పుస్తకాలను అందజేశారు. రుద్రూర్ మండలంలోని పలు గ్రామాల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మండల అధికారులు జడ్పీటీసీ సరోజ గంగారాం, ఎంపీపీ సుజాతతో కలిసి ప్రారంభించారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని వివిధ పాఠశాలల్లో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఆలూర్ మండలం మచ్చర్ల జెడ్పీహెచ్‌ఎస్, పీఎస్ పాఠశాల, దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను ఎంపీపీ పస్కనర్సయ్య అందజేశారు. బాల్కొండ మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల ప్రారంభం రోజే ఏకరూప దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. రెంజల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, డ్రెస్‌లను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. కమ్మర్‌పల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన స్కూల్ యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు. వేల్పూర్ మండలం కుకునూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పుస్తకాలు అందజేశారు. మాక్లూర్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, గుత్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఎంపీపీ మాస్త ప్రభాకర్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.



కుకునూర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు



మాక్లూర్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్



రెంజర్లలో దుస్తులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ



కమ్మర్‌పల్లిలో ఎంఈవో, తహసీల్దార్

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయాగౌడ్, డీఈవో దుర్గాప్రసాద్, సహకార సంస్థల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంఈవో కొడాలి రామారావు, హెచ్‌ఎం సాయిలు, నాయకులు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, హనుమంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన

- ఇబ్బందుల్లో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌లో నిర్మించిన పల్లె దవాఖాన నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేసింది. గతేడాది ఫిబ్రవరిలో పనులకు శంకు స్థాపన చేయగా పనులు సాగుతూ ఎట్టకేలకు పూర్తయ్యాయి. పనులు పూర్తయాయ్యని గ్రామస్తులు సంబుర పడుతున్నా ఇంకా ప్రారంభించక పోవడంపై నిరాశ చెందుతున్నారు. ఈ పల్లె దవాఖాన ప్రారంభిస్తే గ్రామస్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామ పక్కనే పోచంపాడ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా కాకతీయ కాలువ అవతలి వైపు ఉండటంతో అటు వైపు వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజలకు దూరం భారం తగ్గించి స్వగ్రామంలోనే నిర్మించిన పల్లె దవాఖాన నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంకా అప్పగించని వైనం

దవాఖాన పనులు పూర్తయి నెల రోజులు కావస్తున్నా ఎన్నికల కోడ్‌కారణంగా ఇప్పటి వరకు కాంట్రాక్టర్ వైద్యశాఖకు అప్పగించలేదు. దీంతో మరింత ఆలస్యమయ్యేట్లు కనిపిస్తోంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చేపట్టిన పనులను వైద్యా ఆరోగ్యశాఖ అధికారులతో చెక్ లిస్టు చేయించి అప్పగిస్తే వెంటనే ప్రారంభించే అవకాశం ఉంది.

ఇంకా అప్పగించలేదు

సోన్‌పేట్‌లో నిర్మించిన పల్లె దవాఖాన భవన పనులు పూర్తయ్యాయి. ఇంకా భవనాన్ని కాంట్రాక్టర్ వైద్యఆరోగ్య శాఖకు అప్పగించలేదు. ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైంది. ప్రక్రియ వెంటనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– రాకేశ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పోచంపాడ్

హెచ్‌ఎంను సన్మానించిన ఎమ్మెల్యే



బోధన్: పట్టణ కేంద్రంలోని బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అజీమొద్దీన్ ఈ నెల ఆఖరులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో బుధవారం నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్‌ఎం అజీమొద్దీన్‌ను సన్మానించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం



రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లిలో ఉన్న గంగమ్మ దేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాన్ని పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉంచాలని భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ, గంగపుత్ర సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి



నందిపేట్: మండలంలోని శాపూర్‌లో ఉన్న మహిళా సంఘ భవనంలో సౌకర్యాలు కల్పించాలని గ్రామ సంఘం అధ్యక్షురాలు ఏరుగట్ల లత కోరారు. గ్రామంలో 44 మహిళా సంఘాలు ఉండగా అందులో 498 మంది సభ్యులున్నారన్నారు. సంఘ భవనంలో ఒకే గది ఉండడంతో సమావేశం నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే టాయిలెట్ల సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అలాగే సంఘ భవనానికి ప్రహరీ ముందు రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని సంఘం వీఏవో స్వర్ణలత, ఆర్గనైజర్ గంగామణి కోరారు.

అధ్వానంగా పారిశుధ్యం

- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



సావెల్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

బాల్కొండ : గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పల్లెల్లో సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. కానీ పల్లెల్లో మాత్రం పత్యేక పాలన కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. మెండోరా మండలం సావెల్‌లో ఇళ్ల మధ్యలో మురికి నీరు కుంటల నిలిచింది. దీంతో దోమలు విలయ తాండవం చేస్తున్నాయి. గ్రామస్తులు రోగాల భారీన పడే ప్రమాదం ఉంది. అయిన అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇళ్ల మధ్యలో డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో మురుగు నీరు ఖాళీ ప్రదేశాల్లో నిలుస్తోంది. జీపీల్లో నిధులు లేక పోవడంతో సీసీ డ్రెయినేజీలు నిర్మించడం లేదని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నిలిస్తే మరింత సమస్య తలెత్తుతుంది. దీంతో సీజనల్ వ్యాధులు ఎక్కువ ప్రబలే ప్రమాదం ఉంది. అయిన అధికారులు ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం డ్రెయినేజీల వెంట బ్లీచింగ్ పౌడర్ కూడా వేయించడం లేదు. కాగా దీనిపై జీపీ కార్యదర్శి లతను వివరణ కోరగా నిధులు లేకపోవడంతో డ్రెయినేజీలు నిర్మించలేదని చెప్పారు.

వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీపై పోరాడాలి



మాట్లాడుతున్న రాంచందర్

ఆర్మూర్: ప్రజాస్వామ్య దేశంలో వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీ పై పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేజీ రాంచందర్ అన్నారు. మండలంలోని మైత్రి గార్డెన్స్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు మూడో రోజైన బుధవారం కొనసాగాయి. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పృథ్వీ అధ్యక్షతన నిర్వహించిన ఈ తరగతుల్లో ఆయన బోధిస్తూ దేశంలో కుల, మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతూ ప్రభుత్వాలు అభివృద్ధిని, సంక్షేమాన్ని వదిలేసి విభజన రాజకీయాలకు పూనుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ ఎస్ నాగేశ్వర్ రావు, పి రామకృష్ణ, నామాల ఆజాద్, అనిల్, నరేందర్, ఎర్ర అఖిల్ కుమార్, సాయి, సురేశ్, కర్క గణేశ్, వెంకటేశ్, సీతారాం, తిరుపతి, కావ్య, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



నోటీసు అందిస్తున్న వ్యవసాయాధికారి

రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో ఉన్న వి వన్ ఆగ్రో కెమికల్స్ దుకాణాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఎఫ్ఎంసీ, బేయర్, కార్టేవా, డౌవ్, నాగార్జున ఆగ్రో కెమికల్స్ కంపెనీలకు చెందిన పెస్టిసైడ్‌లు ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించి ఆ కంపెనీలకు చెందిన స్టాక్‌ను ఆదేశాలు ఇచ్చే వరకు విక్రయించరాదని దుకాణ యజమానికి నిలుపుదల ఉత్తర్వుల నోటీసు అందించారు. స్టాక్ విలువ రూ. 8లక్షల72వేల419 ఉంటుందని వ్యవసాయాధికారి వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల పనుల పరిశీలన



ముప్కాల్‌లో పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్



నవీపేటలో పీఆర్ ఈఈ

బాల్కొండ/ నవీపేట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులను ముప్కాల్ తహసీల్దార్ శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమైనా పనులు పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగారాం, ఉపాధ్యాయులు ఉన్నారు.

నవీపేట మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పీఆర్ ఈఈ శంకర్‌రాథోడ్ పరిశీలించారు. నవీపేటలోని బాలుర ఉన్నత పాఠశాల, దర్యాపూర్ ప్రాథమిక పాఠశాల, స్టేషన్ ఏరియా, ఆశానగర్‌లోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట పీఆర్ డీఈఈ రాజయ్య, ఏఈ శ్రావణ్ ఉన్నారు.

సమాచారం..

15న తైబజార్ వేలం

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 15న తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్మూర్‌తో పాటు పెర్కిట్, మామిడిపల్లికి చెందిన తైబజార్ వేలం వేయనున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5లక్షల డీడీతో పాటు రూ. 12లక్షల విలువ గల ఇంటి, వ్యవసాయ భూమి వాల్యుయేషన్ చేసిన ధ్రువీకరణ పత్రాలు జతపర్చాలన్నారు. వీటిని 14వ తేదీ సాయంత్రం లోపు మున్సిపల్ కార్యాలయంలో అందించాలన్నారు.

ఆధ్యాత్మికం..

రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు



ఎడపల్లి: మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా గౌడ సంఘం నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లవ్‌బాయ్స్ (తెలుగు) - 11.05, వెపన్(తెలుగు) - 1.50, భజే వాయువేగం - 4.30, లవ్‌మౌళి (తెలుగు) - 7.25, రక్షణ - 10.30

స్క్రీన్-3 – మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30

స్క్రీన్-4 – సత్యభామ - 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి - 1.45, బ్యాడ్‌బాయ్స్ - 7.45